అప్‌గ్రేడ్ చేసినా.. అవే సేవలు

- పాలకవీడు ఆరోగ్య ఉప కేంద్రాన్ని పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి 20 నెలలు
- పర్మినెంట్ డాక్టర్, సిబ్బందిని నియమించని ప్రభుత్వం
- సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న ప్రజలు


పాలకవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పాలకవీడు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలకవీడు సబ్ సెంటర్‌ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసి సుమారు 20 నెలలు కావొస్తోంది. కానీ నేటికీ పర్మినెంట్ డాక్టర్‌ను నియమించలేదు. ఒక్క స్టాఫ్ నర్స్, ఏఎన్‌ఎంలు మాత్రమే ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. సరిపడా సిబ్బంది కూడా లేకపోవడంతో మండలంలోని రోగులకు అవస్థలు తప్పడం లేదు. సబ్‌సెంటర్‌గా ఉన్నప్పుడు అందించిన సేవలే నేటికీ కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు ఆర్‌ఎంపీలను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది. అత్యవసరమైతే సుమారు ముప్పై కిలోమీటర్ల దూరంలోని నేరేడుచర్ల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

సౌకర్యాలు కరువు..

మండలంలో దాదాపు 95 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పాము, తేలు, కుక్క కాటుకు గురైనప్పుడు పీహెచ్‌సీలో టీకాలు అందుబాటులో లేవు. దీంతో బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పట్టణాలకు పరిగెత్తాల్సి వస్తోంది. ఇక గర్భిణులు, బాలింతల పరిస్థితి దయనీయం. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జ్వరాలు ప్రబలినప్పుడు మండల ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. సాధారణ జ్వరం, జలుబు వంటి వాటికి మాత్రలు అందించడం తప్ప అత్యవసర కేసులను పట్టించుకునేవారు లేరు. ఆసుపత్రిలో ఇన్‌పేషంట్‌ల వార్డులు, రక్త, మూత్ర పరీక్షలకు ల్యాబ్ లేదు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించలేని దుస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించాలని, వైద్య సేవలు మెరుగుపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు



పాలకవీడు సబ్ సెంటర్‌ను పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా వైద్యుడిని నియమించలేదు. చిన్నపాటి జబ్బులకు ప్రజలు నేరేడుచర్ల, మిర్యాలగూడలో గల ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రస్తుత సమయంలోనూ తిప్పలు తప్పడం లేదు. పర్మినెంట్ వైద్యుడిని, సిబ్బంది నియమించి, ఆస్పత్రిలో సదుపాయాలు కల్పించాలి.

– దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, సీపీఎం నాయకుడు, గుడుగుంట్లపాలెం

ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లా



పాలకవీడు పీహెచ్‌సీలో పర్మినెంట్ డాక్టర్, సిబ్బంది, వసతులు లేని మాట వాస్తవమే. మండలంలోని మిగతా సబ్ సెంటర్ల ద్వారా కూడా వైద్యసేవలు అందిస్తున్నాం. రోగులకు అత్యవసరమైతే నేరేడుచర్ల, జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నాం. ఇక్కడి సమస్యను ఉన్నతాధికారులకు తెలిపాం

– పున్న నాగిని, ఇన్‌చార్జ్ వైద్యాధికారి, పాలకవీడు

ఏటీఎస్ ఏర్పాటుకు కృషిచేస్తాం


ఆర్టీఓ సురేష్‌రెడ్డిని సన్మానిస్తున్న రవాణా శాఖ అధికారులు, లారీ అసోసియేషన్ నాయకులు

కోదాడరూరల్ : కోదాడలో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్ (ఏటీఎస్) ఏర్పాటుకు కృషి చేస్తామని పలువురు రవాణా శాఖ అధికారులు అన్నారు. ఆదివారం పట్టణంలోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో సూర్యాపేట ఆర్టీఓగా పనిచేసి పదోన్నతిపై వరంగల్ డీటీసీగా పదోన్నతిపై వెళ్తున్న సురేష్‌రెడ్డికి ఏర్పాటు చేసిన అభినందన, సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇబ్బందుల్లో ఉన్న లారీ యజమానులకు చట్టపరంగా తమవంతు సహాయ సాకారాలు అందజేస్తామని తెలిపారు. కొన్ని సందర్భాల్లో లారీ డ్రైవర్ల తప్పులేకున్నా శిక్ష అనుభవించాల్సి వస్తుందని, రానున్న రోజుల్లో రోడ్డు ప్రమాదాల్లో ఎవరితప్పు ఉంటే వారికి శిక్షపడే విధంగా కొత్త టెక్నాలజీ అందుబాటులోకి రానుందని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీఓ, రవాణాశాఖ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, నల్గొండ డీటీసీ వాణి, కామారెడ్డి డీటీఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా డీటీఓ జయప్రకాష్, ఆర్టీఓ రవికుమార్, ఎంవీఐలు జిలానీ, శ్రీని వాస్, కొండయ్య, రిటైర్ట్ ఎంవీఐ సుభాష్, లారీ అ సోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, రాష్ట్ర లారీ సోసియేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో అవకాశం కల్పించాలి


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మున్నూరు కాపు నాయకులు

హుజూర్‌నగర్ : మున్నూరు కాపులకు జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టా కిషోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవులపాటి రామారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని టౌన్ హాల్‌లో మున్నూరు కాపు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం చేసిన కులగణనలో మున్నూరు కాపు జనాభా తక్కువ చేసి చూపించారని ఆరోపించారు. రాష్ట్రంలో 25 లక్షలకు పైగా మున్నూరు కాపు జనాభా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలేటి రామారావు, కొట్టు బాబు, తిరు పతి వెంకయ్య, బాల వెంకటేశ్వర్లు, కోలా శ్రీను, కె.వీరయ్య, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోరాట యోధుల చరిత్రను వెలుగులోకి తేవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోదాడ : తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను వెలుగులోకి తీసుకు రావాలని, దీనికోసం తెలంగాణ వాదులు కృషిచేయాలని ప్రజాచైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని కోరారు. ఆదివారం పట్టణంలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చిత్రం పోస్టర్‌ను ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించిన మాట్లాడారు. చిత్రంలో తెలంగాణ కళాకారులకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాణ కమిటీ చైర్మన్, సహ నిర్మాత అంకతి అనసూర్య, పందిరి నాగిరెడ్డి, బడుగుల సైదులు, పాలూరి సత్యనారాయణ, కోదాడ గురవయ్య, చందా శ్రీనివాస్, రామనర్సయ్య, మజహర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గం ఎన్నిక


యారవ శ్రీనివాస్, అధ్యక్షుడు


ఎస్‌కె సత్తార్, ప్రధాన కార్యదర్శి

నేరేడుచర్ల : భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) నేరేడుచర్ల మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా పారేపల్లి శేఖర్‌రావు, అధ్యక్షుడిగా యారవ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సత్తార్, కోశాధికారిగా గుంజ రవీందర్, ముఖ్య సలహాదారులుగా షేక్ ఖాజావలి, నకిరేకంటి కోటేశ్వర్ రావు, ఉపాధ్యక్షులుగా షరీఫ్, అజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా సైదా, పఠాన్ కరీముల్లా, గుంజ భిక్షం, సహాయ కోశాధికారిగా నీలా రామ్మూర్తి, ఆర్గనైజర్‌గా మట్టయ్య, సహాయ ఆర్గనైజర్‌గా ఈశ్వరయ్య, సభ్యులుగా పటాన్, నాగుల్‌మీరా, వెంకన్న, నాగరాజు, రహీమ్‌తుల్లా, జానీ, నాగమ్మ, శ్రీనివాస్, నరేష్, శివ, శ్రీనులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొదమగుండ్ల నగేష్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి


చిమిర్యాలలో మొక్క నాటి ఆయిల్‌పామ్ సాగును ప్రారంభిస్తున్న ఉద్యానవన అధికారి

కోదాడరూరల్ : ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం పలు రకాల సబ్సిడీలు అందజేస్తుందని ప్రాంతీయ ఉద్యానవన అధికారి అనిత తెలిపారు. ఆదివారం మండలంలోని చిమిర్యాలలో రైతు కృష్ణయ్య చేపడుతున్న ఆయిల్ పామ్ సాగులో మొక్క నాటి మాట్లాడారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, రైతులు సాగు చేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. నీటి వసతి ఉన్న రైతులు ఇతర పంటలకు బదులు ఆయిల్ పామ్ సాగు చేస్తే నాలుగేళ్ల తర్వాత నుంచి దాదాపుగా 20 ఏళ్లకు పైగా దిగుబడి పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం డ్రిప్, ఎరువులు, అంతర పంటల సాగుకు సబ్సిడీలు కూడా ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రావు, ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్, లక్ష్మణ్, గణేష్, రైతులు ఉన్నారు.

ఎన్నికల్లోపే నోటిఫికేషన్ విడుదల చేయాలి

గరిడేపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లోపే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో అంబటి భిక్షం, తుమ్మల సైదయ్య, అర్జున్, మండవ సైదులు, దోసపాటి భిక్షం, శ్రీనివాస్, కళమ్మ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు

మఠంపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని మట్టపల్లిలో జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఏళ్ల తరబడి పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, వీరబ్రహ్మాచారి, రాము, వినోద్, నాగేశ్వరరావు, నరసింహారావు, శాంతిబాయి, మగతిబాయి పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తే సమాజంలో గుర్తింపు


రైతు ఉపేందర్‌రావును సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

మోతె : ఏ వృత్తిలోనైనా బాధ్యతాయుతంగా పనిచేస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మోతె మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బోడబండ్లగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రౌతు ఉపేందర్‌రావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన


మఠంపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

మఠంపల్లి : ప్రధానమంత్రి నరేంద్రమోదీ తల్లిపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ ఆదివారం మఠంపల్లిలోని ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో స్త్రీని గౌరవిస్తారని, మాతృదేవోభవ అని కొనియాడుతారని, అలాంటి వారిని కించపరచడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా నాయకుడు బానోతు రంగానాయక్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి రావుల హుస్సేన్ గౌడ్ సైదులు, మహేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోటి, అంజి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయుడి పోరాటం


మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

నేరేడుచర్ల : మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై తనకు సెలవు, సమయం దొరికినప్పుడల్లా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు మద్దిరాల మండలం గోర్లంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్. ఆదివారం నేరేడుచర్ల మండలం కేంద్రంలో డ్రగ్స్, మత్తు పదార్థాలపై విచిత్ర వేషధారణలో మైక్‌తో ఆయన ప్రచారం చేశాడు. మద్యపానం ఆరోగ్యానికి హానికరం, నో డ్రగ్స్.. సేవ్ లైఫ్ అంటూ ప్రజలను చైతన్యపరిచాడు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు పంచాడు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసై యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించాడు. కార్యక్రమంలో నేరేడుచర్ల పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వరద మిగిల్చిన విషాదానికి ఏడాది

- నాడు అతలాకుతలమైన తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు
- భారీగా దెబ్బతిన్న పంటలు, ఇళ్లు

కోదాడరూరల్ : గత ఏడాది ఆగస్టు 31 రాత్రి కోదాడ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి మండలంలోని తొగర్రాయి, కూచిపూడి గ్రామాల ప్రజలు వరదలో చిక్కుకొని చిగురుటాకుల్లా వణికిపోయారు. ఆరోజు రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రామాలకు ఎగువన ఉన్న చిలుకూరు మండలం నారాయణపురం చెరువుకు రెండు చోట్ల గండి పడటంతో అంతర్గంగ వాగు ఉధృతంగా ప్రవహించి దిగువన ఉన్న తొగర్రాయి, కూచిపూడిలోని డెబ్బై శాతం ఇళ్లల్లోకి వరదనీరు వచ్చి చేరింది. దీంతో ఇళ్లలో వస్తుసామగ్రి తడిసింది. కొత్త, పాత తొగర్రాయి గ్రామాలను కలిపే అంతర్గంగ వాగుపై ఉన్న వంతెన వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోవడంతో నాడు రెండు రోజుల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. వందల సంఖ్యలో వ్యవసాయ మోటార్లు, పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు, ద్విచక్రవాహనాలు, 8 గేదెలు, ఓ ట్రాక్టర్ వరదలో కొట్టుకుపోగా 900 వరకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. తొగర్రాయిలో నాలుగు ఇళ్లు వరదదాటికి పూర్తిగా ధ్వంసం కాగ కూచిపూడిలో 3 ఇళ్లు దెబ్బతిన్నాయి. దాదాపుగా 2 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది.


గతేడాది భారీ వరదలకు పూర్తిగా కొట్టుకుపోయిన తొగర్రాయి రోడ్డు


ప్రస్తుతం ఉన్న రోడ్డు

సంక్షిప్త సమాచారం

తాగునీటి వనరుల్లో నిమజ్జనం చేయొద్దు

గరిడేపల్లి : తాగునీటి వనరుల్లో గణపతుల విగ్రహాలు నిమజ్జనం చేయొద్దని ఎస్‌ఐ చలికంటి నరేష్ ప్రజలను కోరారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. భద్రతా చర్యల దృష్ట్యా సాగర్ కాలువల్లో నిమజ్జనాలను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ముఖ్యంగా మంచినీటి కాలువలు, సాగర్ ఎడమ కాల్వల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయొద్దని సూచించారు. చెరువులు, కుంటల్లోనే నిమజ్జనం చేయడం సురక్షితమని సూచించారు. ఈత రాని వారు, పిల్లలు, వృద్ధులు, మహిళలు నీటిలోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి

మునగాల : మునగాల గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు అన్నెపాక వెంకటరత్నం (55) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. గత వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న వెంకటరత్నం ఖమ్మంలోని ఆస్పత్రిలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటరత్నం దహన సంస్కారాలకు తక్షణసాయం కింద పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ మృతుడి భార్యకు రూ.పదివేల ఆర్థికసాయాన్ని అందజేశారు. వెంకటరత్నం మృతిపట్ల మండల పంచాయతీ అధికారి నరేష్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు బండారు గురవమ్మ సంతాపం ప్రకటించారు.

వార్డు మాజీ సభ్యుడు మృతి

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వార్డు మాజీ సభ్యుడు గుండు పెద లింగయ్య (35) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన మృతదేహానికి నడిగూడెంకు చెందిన వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నడిగూడెం : మండలంలోని రత్నవరం గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా పని చేస్తున్న మొలుగూరి నర్సింహారావు (38) ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో ఆదివారం మృతుడి కుటుంబానికి గ్రామ మాజీ సర్పంచ్ పసుపులేటి వినయ్‌వర్ధన్‌బాబు, రమాదేవి దంపతులు రూ.5 వేలు, యరగాని వీరబాబు రూ.2500,రాంబాబు రూ.2 వేల ఆర్థికసాయం అందజేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్ : గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం, మండల కార్యదర్శి పి.హుస్సేన్ కోరారు. ఆదివారం మండలంలోని గోపాలపురంలో ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. నాయకులు వెంకటయ్య, భిక్షం, తిరపయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు జననం

మేళ్లచెరువు : మండలంలోని హేమ్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సాధుతండాలో ధారావత్ రవీందర్‌కు చెందిన గేదె ఒకే ఈతలో రెండు మగ దూడలకు జన్మనిచ్చింది. కానీ గేదె ఈనేటప్పుడు ఇబ్బంది పడి ఎక్కువ సమయం పట్టడంతో రెండు దూడలు మృతి చెందినట్లు పశు వైద్యసిబ్బంది తెలిపారు. గేదె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

నడిగూడెం : రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని సిరిపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరతతో గతకొద్ది రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు పసుపులేటి వెంకటేశ్వర్లు, నాగుల్ మీరా, శ్రీను, సుజాత, రాములు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నడిగూడెం : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీజీఈ జేఏసీ జిల్లా కార్యదర్శి చారుగుండ్ల కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని పలు రాష్ట్రాలలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని, తెలంగాణలో కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగులను ఆదుకోవాలన్నారు.

అనసూర్యమ్మకు నివాళి

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన సీపీఐ నాయకురాలు కొండా అనసూర్యమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఆమె మృతదేహాన్ని సీపీఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అభివృద్ధికి ఆమె చేసిన కృషి మరువలేనిదని అన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు బొల్లు ప్రసాద్, సత్యనారాయణ, కోటేశ్వరరావు, వెంకటరమణ, ప్రసాద్ ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

గరిడేపల్లి : తుంగతుర్తిలో సెప్టెంబర్ 1న నిర్వహించబోయే భవన నిర్మాణ కార్మికుల 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జంజనం వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

గణనాథుడికి పూజలు, శోభాయాత్రలు


చిలుకూరులో వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


హుజూర్‌నగర్ : శోభాయాత్రలో మహిళల కోలాట ప్రదర్శన

హుజూర్‌నగర్ : పట్టణంలో వినాయక చవితి నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలో పలుచోట్ల ప్రతిష్ఠించిన గణనాథుల శోభాయాత్రను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం గణేష్ విగ్రహాలను మట్టపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. మండపాల నిర్వాహకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన

నేరేడుచర్ల : గణేష్ నవరాత్రి ఉత్సాల్లో భాగంగా నేరేడుచర్ల పట్టణంలోని ఎస్‌ఆర్‌కే రెసిడెన్సీలో గణపతి మండపం వద్ద ఆదివారం కుంకుమార్చన నిర్వహించారు. వేదపండితులు ఇరువంటి శ్రీపాదశర్మ, సంతోష్‌శర్మలు వేదమంత్రోత్సవాల మధ్య అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌కే రెసిడెన్సీ అధ్యక్షుడు భోనగిరి అంజయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

మునగాల : మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని మాజీ సర్పంచ్ ఎర్రం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో దాతలు ఎర్రం సుబ్బారెడ్డి– అరుణ దంపతులు, తిమ్మారెడ్డి సైదిరెడ్డి– నాగమణి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ బి.శ్యాంసుందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సైదిరెడ్డి, అనిల్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, నాగిరెడ్డి, రవిచంద్రారెడ్డి, గణేష్ యూత్ సభ్యులు నందకిశోర్‌రెడ్డి, ప్రతీక్‌రెడ్డి, కార్తికేయరెడ్డి, ప్రణదీప్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి, జస్వంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, భవిక్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, రణదీప్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : పూజలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

వినాయకుడి సన్నిధిలో అన్నదానం

మోతె : మండల కేంద్రంతో పాటు రాఘవాపురం ఎక్స్ రోడ్డు, హుస్సేన్‌బాద్, ఉర్లుగొండ గ్రామాల్లో నెలకొల్పిన వినాయకుల వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రాఘవాపురం ఎక్స్ గ్రామంలో కారింగుల వెంకన్న, విగ్నేశ్వర ఫర్టిలైజర్ యాజమాన్యం, చాంద్‌పాషా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్ది మధుసూదన్‌రెడ్డి, బట్టిపల్లి నాగమల్లయ్య, కోల లింగయ్య, లింగమూర్తి, కోల ఉపేందర్, కారింగుల సత్యనారాయణ, కమలాకర్, మామిడి వెంకటేశ్వర్లు, పులి ఈదయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో..

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని గోపిరెడ్డినగర్, గణేష్‌నగర్, శ్రీమన్నారాయణ కాలనీ, 35 వార్డులో నెలకొల్పిన వినాయక మండపాల వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పార్టీల నాయకులు, నిర్వాహకులు ఉన్నారు.

గణనాథుడి శోభాయాత్ర

పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వినాయకుని శోభాయాత్రను ఆదివారం అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం 5వ రోజు గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో డప్పుచప్పుళ్లతో వైభవంగా వినాయకుల ఊరేగింపు నిర్వహించారు.


కోదాడరూరల్ : గణనాథుడి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు


నేరేడుచర్ల : కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఏకదంతుడి ఎదుట ఏకాగ్రతతో..


సీతానగరంలోని వినాయక మండపంలో చదువుకుంటున్న చిన్నారులు

మునగాల : గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా మునగాల మండలంలోని సీతానగరంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో ఆదివారం పలువురు చిన్నారులు చదువుకుంటూ కాలం గడిపారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో వినాయక చవితి వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన చిన్నారులు తమవెంట పుస్తకాలు తెచ్చుకొని ఏకాగ్రతతో చదువుకోవడం అందిరినీ ఆకర్షించింది.

పేద కుటుంబానికి బియ్యం అందజేత

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పిల్లుట్ల ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబానికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు జక్కుల గురువయ్య సహకారంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం వీరయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కల నాగరాజు క్వింటా బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బండి వెంకటరెడ్డి, బైరుబాలు, షేక్ సలీం, ఎల్లావుల ఉపేందర్, వీరబాబు, సైదులు, శంకర్ ఉన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద కుటుంబానికి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు టి.సాయిరాంగౌడ్ ఆదివారం 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.